క్లుప్తంగా

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ


కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడిపత్రి రూరల్: మండలంలోని బ్రహ్మణపల్లి, బి.కొత్తూరు పాఠశాలల్లోని 28 మంది విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశామని డివిజన్ జీపీఎంఓ మధుసూదన్ తెలిపారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అనిల్ కుమార్,నాగిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే ఆర్డీటీ లక్ష్యం


గృహాలను ప్రారంభిస్తున్న స్పెయిన్ దేశీయులు

శింగనమల: గ్రామీణ ప్రాంతాల్లోని పేద మహిళల సంక్షేమానికి ఆర్డీటీ ఎంతో కృషి చేస్తోందని రీజినల్ డైరెక్టర్ లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం మండలంలోని లోలూరులో ఆర్డీటీ నిర్మించిన గృహాలను స్పెయిన్ దేశీయులు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో ఆర్డీ మాట్లాడుతూ కుటుంబం ఆర్థికంగా బాగుండాలంటే పొదుపు ఉండాలన్నారు. కార్యక్రమంలో బీకేఎస్ ఏటీఎల్ సుధాకర్, సీఓ అమర్నాథ్‌రెడ్డి, వన్నూరుస్వామి, కృష్ణారెడ్డి , రీజినల్ ఇంజినీరు జ్యోతి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

సంతాపం


సంతాపం తెలియజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

గుంతకల్లుటౌన్: అనంతపురం నగరంలోని 6వ సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ విజయలక్ష్మి మృతికి స్థానిక సచివాలయ ఉద్యోగులు సంతాపం తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజయలక్ష్మి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దేవేంద్రకుమార్, లోకేష్, సచివాలయ ఉద్యోగ సంఘం నాయకులు రమేష్‌రావు, భవాని, ప్లానింగ్ కార్యదర్శులు శ్రీనివాసులు, మేరీమాత, నవనీత, ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

గోవుకు కృత్రిమ కాలు ఏర్పాటు


కృత్రిమ కాలు అమర్చిన గోవును పరిశీలిస్తున్న వైద్య బృందం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం గోశాలలోని గోవుకు శుక్రవారం కృత్రిమ కాలును అమర్చారు. వివరాలు.. పుట్టుకతోనే ఆవుదూడకు కాలు లేక పోవడంతో యజమాని ఆలయ గోశాలకు తరలించాడు. రెండేళ్లుగా దూడకు పరిచర్యలు చేశారు. శ్రీ షిర్డీ సాయి సేవా సత్సంగ్ ట్రస్టు బళ్లారి, మహావీర్ లింబ్ సెంటర్ హుబ్లి సంయుక్త ఆధ్వర్యంలో గోవులకు కృత్రిమ అవయవాలు ఉచితంగా అమరుస్తున్నట్లు తెలుసుకున్న ఆలయ అధికారులు వెంటనే వారిని సంప్రదించారు. నెల రోజుల క్రితం కసాపురం వచ్చిన వైద్యులు కాలు లేని గోవుకు కృత్రిమ కాలు అమర్చే క్రమంలో భాగంగా కొలతలు తీసుకు వెళ్లారు. శుక్రవారం ఆవుకు కృత్రిమ కాలును విజయవంతంగా అమర్చారు. ఆలయ అధికారులు, ఇతర సిబ్బంది వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పట్టుబడిన పశువులు గోశాలకు తరలింపు


పశువులను గోశాలకు తరలించిన పోలీసులు

గుత్తి: గుత్తిలో గురువారం రాత్రి పట్టుబడిన పశువులను పోలీసులు గోశాలకు తరలించారు. వివరాలు.. ఐచర్ వాహనంలో అక్రమంగా పశువులను (17 ఎద్దులు) తరలిస్తుండగా ప్రజలు పట్టుకుని పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. ఐచర్ డ్రైవర్, వ్యాపారి పరారయ్యారు. సీఐ వెంకటేశ్వర్లు, ఏఎస్‌ఐలు నాగమాణిక్యం, ఆజాద్, సిబ్బంది పట్టుబడిన పశువులను గుంతకల్లు మండలం నాగసముద్రం గోశాలకు తరలించారు. సంఘటనపై సీఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆదర్శం కనుమురుగు

- తాడిపత్రి మున్సిపాలిటీలో సమస్యల తిష్ట
- మురుగు సమస్యతో ప్రజల సతమతం
- ప్రచారానికే పరిమితమైన స్వచ్ఛత కార్యక్రమాలు


పప్పూరు రోడ్డు సమీపంలో ప్రధాన రహదారిపై నిలిచిన మురుగు


రైల్వే బ్రిడ్జ్ సమీపంలో కుంటను తలపిస్తున్న మురుగు

తాడిపత్రిటౌన్: గతంలో ఆదర్శంగా నిలిచిన తాడిపత్రి మున్సిపాలిటీలో ప్రస్తుతం మురుగు సమస్యలు వేధిస్తున్నాయి. పట్టణంలోని పలు కాలనీల్లో అండర్ డ్రైనేజీ సమస్యలు తలెత్తడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో మురుగు సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో డ్రైనేజీ నీరు బయటకు వచ్చి పాచిపట్టి దోమలకు ఆవాసంగా మారింది. తాడిపత్రి పట్టణంలో 32 వేల కుటుంబాలుండగా దాదాపు 1.30 లక్షల జనాభా ఉంది. 2007లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తాడిపత్రి పట్టణంలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి చేపట్టారు. ఆయా కాలనీల్లో దాదాపు 130 కిలోమీటర్లు పట్టణంలో దాదాపు 90 శాతం అండర్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం అండర్ డ్రైనేజీలో తరచూ సమస్యలు వస్తుండటంతో మ్యాన్‌హోల్‌లో నుంచి మురుగు బయటకు వచ్చి రోడ్డుపై పారుతోంది. మురుగు ఒక్కచోట చేరి కుంటలను తలపిస్తున్నాయి. దోమల వ్యాప్తికి కారణం అవుతున్నాయి. దుర్వాసన వస్తుండటంతో సమీప షాపులు, ఇంటి యజమానులు ఇళ్లల్లో ఉండలేకపోతున్నారు. మరికొన్ని చోట డ్రైనేజీ నీరు తాగునీటి పైపుల్లో చేరి నీరు కలుషితం అవుతోంది. పట్టణంలో దోమలు విపరీతంగా వ్యాప్తి చెందడంతో చీకటి పడితే పట్టణ వాసులపై దండయాత్ర చేస్తున్నాయి. దోమల కాటుతో తరచూ వ్యాధులకు గురి అవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛత కార్యక్రమాలు, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు చేపట్టినా అవి ప్రచార ఆర్భాటాలకే పరిమితం అయ్యాయని, ఎలాంటి ఉపయోగం లేదని వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణంలో నెలకొన్న మురుగు సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టణం	తాడిపత్రి
వార్డులు	30
కాలనీలు	78
జనాభా	1.30 లక్షల మంది

దోమల బెడద భరించలేకున్నాం



పట్టణంలో మురుగు సమస్యల కారణంగా దోమలు విజృంభిస్తున్నాయి. చీకటిపడితే చాలు దోమలు ప్రజలపై దండయాత్ర చేస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల చేపడుతున్న స్వచ్ఛత కార్యక్రమాలు ప్రచార ఆర్భాటాలకే పరిమితమయ్యాయి. అధికారులు స్పందించి పట్టణంలో మురుగు సమస్యలు పరిష్కరించాలి.

– రేవతి, అంబేద్కర్ నగర్, తాడిపత్రి

వ్యాధులు వ్యాపిస్తున్నాయి..



పట్టణంలో దోమలు విపరీతంగా ఉండటంతో జ్వరాలు వస్తున్నాయి. చిన్నపిల్లలు తరచూ వ్యాధుల బారిన పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ మరమ్మతులకు నోచుకోకవడంతో పట్టణంలో మురుగు సమస్య నెలకొని దోమల వ్యాప్తికి కారణం అవుతోంది. అధికారులు చర్యలు తీసుకొని డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి.

– రాఘవేంద్రరెడ్డి, ఆనుపత్రిపాలెం, తాడిపత్రి

బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లు అంగీకరించాలి


బీఓబీ ఎదుట నిరసన తెలుపుతున్న బ్యాంకు ఉద్యోగులు

గుంతకల్లుటౌన్: బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లను అంగీకరించాలని యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) నాయకులు మధుసూదన్, శ్రీనివాసులు, నరేంద్ర, ఎడిసన్ డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం రైల్వేస్టేషన్ రోడ్డులోని బ్యాంకు ఆఫ్ బరోడా ఎదుట వివిధ ప్రభుత్వ బ్యాంకులకు చెందిన ఉద్యోగులు నిరసన తెలిపారు. ప్రపంచ బ్యాంకింగ్ విధానాలకు అనుగుణంగా వారానికి ఐదు రోజుల పనిదినాలను అమలు చేయాలని, బ్యాంకుల్లో నియామకాలు చేపట్టి ఉద్యోగులపై పనిభారాన్ని తగ్గించాలని, బ్యాంకు సిబ్బంది దాడులు జరుగుతున్న నేపథ్యంలో భద్రతా చర్యలు చేపట్టాలని, పనితీరు ఆధారిత ప్రోత్సాహకాలను, మైక్రో మేనేజ్‌మెంట్‌పై ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం మార్చి 24, 25 తేదీల్లో చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో యూఎఫ్‌బీయూ నాయకులు సుప్రియ, సునంద, సునీల్, భరత్, రాఘవేంద్ర, కిరణ్, నగేష్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజాన్ని నిర్మిద్దాం


చిన్నవడుగూరు హెల్త్ సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు: ప్రతి ఒక్కరూ టీబీ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని డీఎల్‌టీఓ డాక్టర్ అనుపమ జేమ్స్, అసోషియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుమన సూచించారు. శుక్రవారం మండలంలోని నాగలాపురం, పి.కొట్టాలపల్లి గ్రామాల్లో వారు పర్యటించారు. టీబీ ముక్త పంచాయతీలుగా ఎంపికైన గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది చేపట్టిన కార్యక్రమాలను గురించి అడిగి తెలుసుకున్నారు. టీబీతో బాధపడుతున్న వారి కుటుంబాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నవడుగూరు హెల్త్ క్లినిక్ లో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పెద్దవడుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శ్రీనివాసబాబు, అమర్‌నాథ్, ఎంపీఎస్ దేవదాసు, పీపీఎం నాగమణి, ఎస్‌టీఎల్‌ఎస్ జాఫర్, ఎస్‌టీఎస్ మన్సూర్‌అలీ, హెల్త్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి, ఏఎన్‌ఎం సరోజ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

యల్లనూరు: మండలంలోని కూచివారిపల్లి, తిమ్మంపల్లి, ఎస్.కొత్తపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మరమ్మతులు చేస్తారని ఏఈ రవీంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయా సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

తాడిపత్రి రూరల్: తాడిపత్రి పట్టణ, రూరల్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏడీఈ ప్రభాకర్ తెలిపారు. మండలంలోని తేరన్నపల్లి వద్ద 220కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ కరెంట్ సరఫరా నిలిపివేస్తామన్నారు. రూరల్ పరిధిలోని బుగ్గ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 6.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే సజ్జలదిన్నె, ఆటోనగర్, చుక్కలూరు, ఏవీటీపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 6.30 నుంచి 10గంటల వరకు కరెంట్ సరఫరాను నిలిపి వేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

జగన్‌ను విమర్శిస్తే బుద్ధి చెబుతాం


గుంతకల్లులో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఎండీ ఖలీల్

గుంతకల్లుటౌన్/గుత్తి: ప్రజా సంక్షేమ సారధి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగిన బుద్ధి చెబుతామని జనసేన నియోజకవర్గ నాయకుడు మణికంఠను వైఎస్సార్‌సీపీ నేతలు హెచ్చరించారు. శుక్రవారం గుంతకల్లులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ. ఖలీల్, కౌన్సిలర్ లింగన్న, ఎస్సీ, యువజన విభాగాల నియోజకవర్గం అధ్యక్షుడు వీరేష్, అబ్దుల్‌బాసిద్, విద్యార్థి విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి వంశీయాదవ్ మాట్లాడారు. ప్రజానేత వైఎస్.జగన్‌ను కించపరిచేలా మణికంఠ చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. జగన్‌ను విమర్శించే స్థాయి జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు గానీ ఆ పార్టీ నాయకులకు గానీ లేదన్నారు. జగనన్న పట్ల అవాకులు పేలుతున్న మణికంఠకు దమ్ముంటే, ధైర్యం ఉంటే ఎలాంటి పొత్తు లేకుండా కౌన్సిలర్‌గా పోటీచేసి గెలవాలని వారు సవాల్ విసిరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వాల్మీకి రాము, మాజీ సర్పంచ్ తిక్కస్వామి, పెయింటర్ హరి, పార్టీ అనుబంధ విభాగాల నియోజకవర్గ అధ్యక్షులు అంజి, రంగనాయకులు, నారప్ప, షాబుద్దీన్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గుత్తిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు మధుసూదన్ రెడ్డి, గంగరాజు, మాజీ కన్వీనర్లు పీరా, గోవర్ధన్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షుడు సీపీ రంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ విభాగం జిల్లా అధ్యక్షుడు వైపీ బాబు, జిల్లా నాయకులు రంగస్వామి, మల్లయ్య యాదవ్, దేవా, గాదిలింగేశ్వర్, మధు, కుమార్, జీపు రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల పొట్ట కొడుతున్నారు

పామిడి: రెండునెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు ఇవ్వకుండా వారి పొట్ట కొడుతున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సాకే నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి మల్లేసు ధ్వజమెత్తారు. శుక్రవారం మండలంలోని పొగరూరు, గజరాంపల్లిలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధికూలీల వెతలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ మండుటెండలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు టెంట్లు, మజ్జిగ, మెడికల్ కిట్లు వంటి సౌకర్యాలు కరువయ్యాయన్నారు. రోజూ కూలి రూ.600 ఇవ్వాలన్నారు. 300 రోజులు పనిదినాలు కల్పించాలన్నారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12న విజయవాడలో నిర్వహిస్తున్న మహాధర్నాను జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు, ముత్యాలు, చంద్రమోహన్‌రెడ్డి, శంకర్, బాబయ్య, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించండి

బుక్కరాయసముద్రం: ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి క్రిష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ విజయవాడలో మార్చి 12న నిర్వహించనున్న మహా ధర్నాకు తరలి రావాలని కోరుతూ మండల కేంద్రంలో శుక్రవారం పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ కార్మిక సంఘం నాగలింగమయ్య, పుల్లయ్య, వెంకటేశు, సుంకన్న, నరసింహులు, కిట్టయ్య, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఉపాధి బిల్లులు చెల్లించండి

పెద్దవడుగూరు: కూలీలకు పెండింగ్ ఉన్న ఉపాధి బిల్లులు త్వరగా చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకట్రాముడుయాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని అప్పేచర్లలో గ్రామ కమిటీ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు డబ్బులు సకాలంలో అందక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూలీలకు 200 రోజులు పని దినాలు పెంచాలన్నారు. పని ప్రదేశంలో కూలీలకు మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి నారాయణస్వామి, సహాయ కార్యదర్శి పెద్దన్న, అల్లావలి, రైతుల సంఘం నియోజక వర్గం నాయకుడు ఆదినారాయణ, సీపీఐ మండల కార్యదర్శి పోలా రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

11న తాతార్యారూఢస్వామి తిరునాల

గార్లదిన్నె: మండలంలోని మర్తాడులో ఈ నెల 11న తాతార్యారూఢ స్వామి తిరునాల నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఫాల్గుణ మాసం శుద్ధ ద్వాదశి రోజు తాతార్యారూఢ స్వామి తిరునాల నిర్వహించడం అనవాయితీ అన్నారు. అందులో భాగంగా 10వ తేదీ ఉదయం ధ్వజారోహణం, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, సాయంత్రం రుద్రయజ్ఞం ఉంటుందన్నారు. 11న గంగపూజ, వీరభద్రస్వామి వేషధారణ, రుద్రాభిషేకం, ఆలయ ధర్మకర్త పట్టు వస్త్ర సమర్పణ, సహస్ర బిల్వార్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అలాగే రాత్రి 10 గంటల నుంచి స్వామి పుష్ప రథోత్సవం ఉంటుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి: పట్టణంలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజయలత కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అలాగే 6,7,8 తరగతుల్లో మిగిలిపోయిన సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన విద్యార్థులు మార్చి 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 25న పరీక్ష ఉంటుందన్నారు.

జేసీబీ, ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పామిడి: మండలంలోని నీలూరు–తంబళ్లపల్లి మధ్య పుల్లేటివంక ప్రాంతంలో అక్రమంగా ఇసుక తోడుతున్న ఒక జేసీబీ, ఐదు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండడంతో సీఐ వీ యుగంధర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ బీఆర్ ప్రసాద్, పోలీసులు జేసీబీ, ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వ్యాయామశాల ఏర్పాటు చేయాలి

గుత్తి: గుత్తిలో ప్రభుత్వం తరపున వ్యాయామశాల ఏర్పాటు చేయాలని గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియాకు వినతిపత్రం అందజేశారు. గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్,ఉపాధ్యక్షులు సుధాకర్ నాయుడు, సభ్యులు గంగాధర్ కుమార్, జిలాన్ తదితరులు కమిషనర్‌ను కలిసి జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు.

చర్చీల్లో ఉపవాస ఆరాధన

పామిడి: పట్టణంలోని సీఎస్‌ఐ చర్చిలో శుక్రవారం క్రీస్తు శ్రమల దినాల స్మరణలో భాగంగా శుక్రవార సాయంకాల ఉపవాస ధ్యాన ఆరాధన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దైవ సేవకుడు పీవీఎస్ రాజు క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. అపవాది చేత చెప్పశక్యం కాని శ్రమలు కలిగిన వాటిన్నంటిని ప్రభువు నామంలో జయించిన యోబు మనందరికీ ఎంతో ఆదర్శనమన్నారు. యదార్థత, పశ్చాత్తాపం, ప్రార్థన విశ్వాసగుణంతో శ్రమలన్నింటిని జయించిన యోబును దేవుడు రెండురెట్లుగా ఆశీర్వదించి దీవించాడన్నారు. ఈ ఉపవాస దినాల్లో భక్తుడైన యోబును ఆదర్శంగా తీసుకుని దేవుడికి మహిమకరంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు, వీరయ్య, జయరాజు, జకరయ్య, అబ్రహాం , రాజు, దేవదాసు, ప్రసాద్, రజని, రేచెల్, వాణి, మెర్సీ, లత తదితరులు పాల్గొన్నారు.

ఫారంపాండ్స్ పనులు వేగవంతం చేయాలి


పెరవలిలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న పీడీ సలీంబాషా

శింగనమల: ఉపాధి హామీ కింద చేపట్టిన ఫారంపాండ్స్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, తద్వారా వర్షాకాలంలో నీరు నిల్వ ఉండి భూగర్భ జలం పెరగడానికి అవకాశం ఉందని డీడబ్ల్యూఎంఏ పీడీ సలీంబాషా తెలిపారు. శుక్రవారం మండలంలోని పెరవలి గ్రామంలో జరుగుతున్న ఫారం పాండ్ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కూలీలు ఉదయమే పనులకు వెళ్లి నిర్దేశించిన పనిని పూర్తి చేయాలన్నారు. ఫారం పాండ్ వల్ల కలిగే ఉపయోగాలను రైతుకు వివరించారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీదేవి, టీఏ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం


గుంతకల్లులో ఉపాధ్యాయినులతో మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, వీసీ మైమూన్


బుక్కరాయసముద్రం మండలం రేకులకుంటలో కేక్ కట్ చేస్తున్న శాస్త్రవేత్తలు


గుత్తిలోని గేట్స్ కళాశాలలో అహల్య బాయి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్/గుత్తి/బుక్కరాయసముద్రం/యల్లనూరు/పెద్దవడుగూరు: గుంతకల్లులోనిఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్ మైమూన్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించారు. ఆడపిల్ల చదువు సమాజానికి వెలుగునిస్తుందన్నారు. బాలికలు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం మహిళా టీచర్లను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భూపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు నీలావతి, కుమారి, ఉపాధ్యాయినులు తదితరులు పాల్గొన్నారు.

▸▸ గుత్తి పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం డైరెక్టర్ వాణి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సంఘ సంస్కర్త అహల్య బాయి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థినులు నాటికల ద్వారా మహిళల గొప్పతనాన్ని, ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ ఆయేషా అంజుమ్, హెచ్‌ఓడీలు హరి ప్రియలు శాంతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

▸▸ బుక్కరాయసముద్రం మండలంలోని రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయశంకర్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పరిశోధనా స్థానంలో కేక్ కట్ చేసి మహిళా ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, బోధనేతర మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

▸▸ యల్లనూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల వైద్యాధికారి లోకేష్‌కుమార్, శివసాయి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అలాగే అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీలో సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంకాశీరాణి, గౌరీదేవి, శ్రీదేవిలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

▸▸ యాడికి లోని స్టార్ ప్యారడైజ్ హైస్కూల్ లో శుక్రవారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈఓఆర్డీ శశికళ, మేనేజ్‌మెంట్ నాగేంద్ర, రంగ, ఇలాహి, ఉపాధ్యాయినులు తహరున్, జ్ఞానేశ్వరీ, సుమాంజలి, కృష్ణవేణి, అమరావతి, కుమారి, రూప, అమృత, ఉమాదేవి,సుజితబేగం తదితరులు పాల్గొన్నారు.

అధికారులంతా మహిళలే..

పెద్దవడుగూరు: పెద్దవడుగూరు తహసీల్దార్ కార్యాలయంలో ప్రముఖ అధికార స్థానాల్లో మొత్తం మహిళలే ఉండటం విశేషం. తహసీల్దార్‌గా ఉషారాణి, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరమ్మ, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా జయమ్మ, సీఎస్ డీటీగా కంబక్క, ఆర్‌ఐగా లహరిక బాధ్యతలు నిర్వహిస్తూ కార్యాలయానికి ప్రజలు వచ్చిన వెంటనే స్పందిస్తూ సమస్యలు పరిష్కరిస్తున్నారు. శుక్రవారం తహసీల్దార్‌కు పలువురు అధికారిణులు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే భాగ్యం లభించినందుకు ఆనందంగా ఉందన్నారు.

తల్లి చెంతకు.. తప్పిపోయిన బాలిక

పుట్లూరు: తప్పిపోయిన బాలికను పోలీసులు తల్లికి అప్పగించారు. వివరాలు.. నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం బుగ్గనపల్లికి చెందిన శిరీష అనే 10 సంవత్సరాల బాలిక ఈ నెల 6న తప్పిపోయి పుట్లూరు మండలం తక్కళ్లపల్లికి చేరుకుంది. గ్రామంలో ఒంటరిగా తిరుగుతున్న బాలికను గుర్తించి సచివాలయ మహిళా పోలీసు సరళాదేవికి గ్రామస్తులు సమాచారం అందించారు. ఈ విషయాన్ని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించగా బేతంచెర్ల పోలీసుల ద్వారా బాలిక తల్లి నాగమణిగా గుర్తించి పుట్లూరు సర్కిల్ సీఐ సత్యబాబు సూచనల మేరకు చిన్నారిని తల్లికి అప్పగించారు. బాలికను సకాలంలో గుర్తించి తల్లికి అప్పగించిన మహిళా పోలీస్ సరళాదేవితో పాటు ఏఎస్‌ఐ రాజశేఖర్, హెడ్‌కానిస్టేబుల్ మధు, కానిస్టేబుల్ శ్రీనివాసులును పలువురు అభినందించారు.